

# ఔలాద్

కథ

గీతాంజలి

పెరింట్ల నులక మంచం మీద పండుకుంది నఫీజ్. పిల్లలిద్దర్ని లోపట నిద్రబోయినంక అప్పుడే నులకమంచం మీద కూలవడింది. అత్త నూరున్నిసా పక్కింట్లకుబోయింది జంగమ్మతోని ముచ్చట్లు బెడ్తామని. ముచ్చట్లంటె ఇంకేముంటయ్... కోడండ్ల మీద ఇచ్చకాలు చెప్పుకునుడే వాల్ల ముచ్చట్లు. ఇగ మామ రహమతుల్లా ఆకిట్ల ఏవో ముచ్చట్లు తన వయసు ముసలోల్లతోని ఆడతా కూసున్నడు. రాత్రి బోయనాలు జేసినంక వాల్లు దినాం చేసే పని ఇది. నఫీజ్ మొగడు అర్ఫాజ్ కొసానికై తొవ్వ జూడవట్టింది. అర్ఫాజ్ పొద్దున్న మాంసం దుక్నం నడ్పిస్తనే పగటికెల్లి సైకిలు మీద పట్నంబొయ్యి ఘడీలు రిపేరుజేసే షాపుల పనిజేస్తడు. నఫీజ్, అర్ఫాజ్‌ల పెండ్లయి ఆరేండ్లయ్యింది. వాల్లకు ఇద్దరాడ పోరీలు పుట్టిన్రు- సాజీదా, అమీలూ. ఏదో తీరు సంసారం నడుస్తున్నది. నఫీజ్ ఊరి చివరన ఉన్న నర్సరీల పన్జేస్తది. నెలకు ఒగ పన్నెండు వందలు వస్తయ్. పొద్దున్న బయటవడిందంటె ఇంటి కచ్చేటాల్లకు రాత్రి ఏడవుతది. ఇగ ఇద్దరు పిల్లలను నానమ్మ నూరున్నీసానే చూస్తది.

నూరున్నీసా కొడుకుకు ఇద్దరూ ఆడపోరగాండ్లే ఉన్నరని ఒకడన్న మగపోరడ ఒక ఔలాద్ వుట్టింటె బాగుండునని ఒగతే గోస ఆమెని పరేషాన్ జేస్తున్నది. వంశం నిలవాలె. గందుకు మగపోరడు గావాలె. ఇద్దరాడపోరీల తర్వాత ఇన్నేండ్లాయే నఫీజ్‌కు కడుపు రాకచ్చింది. బందుగులల్ల అందరు ఇదె ముచ్చట సాగుతున్నది. తమకు సిగ్గవుతున్నది. వీని తోటోల్లందర్కి ఇద్దరు ముగ్గురు పోరలు పుట్టిన్రు.

"యే ఔరత్ బచ్చీయోంకో బస్ కర్కే ఏక్ ఔలాద్‌కో పైదా కరో" అంటా రెండేండ్ల సందిగును స్తనే ఉన్నది.

"కాన్పు గాకుంట గోలీ ఎస్కుంటున్నదా ఏంది? బందు జెయ్యమను" అని అర్ఫాజ్‌ని హెచ్చరిస్తనే ఉంటది నడుమనడుమ.

ఒగ రోజు "అరె అర్ఫాజ్... నఫీజ్‌కో డాక్టర్ కనే లేజాకే దిఖావ్... బచ్చే క్యోం నైహోరేకి క్యాకి..." అని అన్నది. నఫీజ్ గుండెలు గుబగుబమన్నయ్. దినాం ఒక్కసారన్నా ఈమాట గుర్తుజేస్తనే ఉన్నది నూరున్నిసా. ఇగ ఎప్పుడో ఒగప్పుడో అసలు సంగతి తెల్వక మానదు. అసలు సంగతి తల్లికి చెప్తానన్నడు అర్ఫాజ్.

"బోల్‌దేంగే. కిత్నే దిన్ ఛుపాయేంగే" అన్నడు నఫీజ్‌తో. ఇగ ఎపుడు చెప్తడో ఏమోగని నఫీజ్ మాత్రం గిజగిజలాడతనే ఉన్నది. మంచంల ఎల్లెత్కల పండుకోని నల్లని ఆస్మాన్‌ని చూస్తా ఆలోశనల వడిపోయింది.

ఇంతట్ల సైకిల్ గంట గణగణ మోగింది. నఫీజ్ గుండె ఒక్కసారి ఝల్లుమన్నది.

"అమ్మీ ఎటువోయింది" అన్కుంట పెరట్లకచ్చి మంచంల పండుకున్న నఫీజ్‌ని చూస్కుంట "బచ్చే సోగయే క్యా... చలో ఖానా లగావ్... భూక్ లగ్‌రై" అని కాల్లు చేతులు కడుక్కున వోయిండు.

అన్నం తిన్కుంట ఆలోచన జేస్తున్నడు అర్ఫాజ్. ఈ లోపట పక్కింటోల్లతోని కారోబారి ఎలగబెట్టిన నూరున్నిసా రానే వచ్చింది. ఆమె ఎంబడే రహమతుల్లా సుగ లోపటికచ్చిండు. ఇగ రేపన్న పని బందువెట్టి నఫీజ్‌ని డాక్టరుతానకు తీస్కపొమ్మన్నది.

"అమ్మీ... నఫీజ్‌కో బచ్చే నై హోతే. తీన్‌సాల్ పైలే బచ్చే నైహోనేకా ఆప్రేషన్ కర్వాయా మైనే..." అర్ఫాజ్ కుత్కెలోని వణుకుని దిగమింగుకుంట చెప్పిండు.

"క్యా... క్యాబోలేరే అర్ఫాజ్" అని వొర్రింది నూరున్నిసా.

నఫీజ్‌కు చెమటలు ధారలుగట్టినయ్.

మూడేండ్ల కింద అమీనా పుట్టింది. కడుపు కోసి పిల్లను తీసిన్రు. సాజిదా గట్లనే పుట్టింది. అమీనా పుట్టినపుడు నఫీజ్‌కు రక్తహీనత ఉండె "పెయిల రక్తమేలేదు. ఇంకోసారి ఆప్రేషన్ గిట్ల జేస్తే మంచిదిగాదు. పిల్లలు గాకుంట ఆప్రేషన్ జేపిచ్చుకోన్రి ఇద్దరున్నరుగద" అన్నది డాక్టరమ్మ. నఫీజ్‌కు గూడా రెండు సిజేరియన్‌లతోని ప్రాణం చాన సుస్తయ్యింది. రెండు సీసాల రక్తమెక్కిచ్చిన్రు. ఇగ పిల్లలు సాలు. నీ ఆరోగ్యం బాగ లేదు. ఇద్దర్ని సాదుడే కష్టంగుంది అని నఫీజ్‌కు నచ్చజెప్పి ఇంట్ల ముసలోల్లిద్దర్కి తెల్వకుంట ఆమెకు ఆప్రేషన్ జేపిచ్చిండు అర్ఫాజ్. ఇప్పడ్దాంక అమ్మీ అబ్బాలకు చెప్పలె. చెప్పే మౌకారాలె. చెప్తే ఇంట్ల ఏం జర్గబోతోందో గూడ దెల్సు.

"ఎట్ల జేపిచ్చుకున్నవే హరాంజాదీ... వానికి సిగ్గు షరం లేకపోతె నీకన్న లేదానె. మేరె బేటాకో బే ఔలాద్ కర్‌దేగీ క్యా" అన్కుంట నూరున్నిసా శివంగి తీరు కోడలు నఫీజ్ మీదకు ఉరికి ఎంటికలు బిగపట్టి ఈపు మీద గుద్దుడు షురు జేసింది. నఫీజ్ అత్త కొట్లని భరించుకుంటనే ఏడ్వబట్టింది.

"అమ్మీ... ఛోడో... ఇండ్ల ఆమె తప్పేం లేదు. సబ్‌కుచ్ మేరీ కహనేసే హువా... ఇగ మమ్ముల సతాయించకున్రి" అన్కుంట నఫీజ్‌ని ఇడిపించుకుని లోపటికి వోయిండు.

నూరున్నిసా కింద కూలవడి "యా అల్లామై క్యాకరూం" అన్కుంట గుండెలు బాదుకోబట్టింది. రహమతుల్లా గూడ నోట మాట లేక గప్‌చుప్‌గ కూసుండిపోయిండు. ఆ రాతిరి ఆలుమొగలిద్దరు నిద్రవోలె.

తెల్లారింది మొదలు నఫీజ్‌కు జీనా హరాం అయ్యింది. నూరున్నిసా గునుగుడు ఎక్కువైంది. ఊకూకనే ఏడుస్తది. శాపాలిస్తది, చాయ ఇస్తె వద్దంటది. అన్నానికి పిలిస్తె లెవ్వదు. తానం గీనం చెయ్యక ముడ్సుకపంటది. అప్పుడే ఏడస్తది అప్పుడే ఖామోష్ అయిపోతది. ఎవ్వలతోని మాటలేదు ముచ్చటలేదు. పిస తీసినట్లే అయ్యింది. ఇది జూసి అర్ఫాజ్‌కు తాయి మాయిగున్నది. గీ తీరు ఒగ వారం దినాలు నడ్సింది.

** ** **

గా దినం మటన్ దుక్నం బందుజేసి సీదా ఇంటికే అచ్చిండు అర్ఫాజ్. తానం గీనం జేసిండు. తెచ్చిన మాంసం నఫీజ్‌కిచ్చి కూర వండమని చెప్పిండు. పిల్లలు కిలకిల నగుకుంట

ఆటలాడుకుంటున్నరు. నఫీజ్ మాత్రం అర్బాజ్ ని వట్టుకోని వలవల ఏడ్వబట్టింది. అర్బాజ్‌కు తెల్సు ఆమె ఎందుకేడుస్తున్నదో. "ఊకోయే.. నీకు తెల్సుగద అమ్మీ సంగతి" అన్కుంట నఫీజ్‌ని ఓదార్చబట్టిండు.

"నై ముఝే ఘర్సే చలే జావ్ బోలే. నీకు ఇంకొక పెండ్లి జేస్తరంట" అన్కుంట ఇంకింత జోరుగ ఏడ్వబట్టింది.

"షాదీనై కుఛ్‌నై చుప్ రహో" అన్నడు అర్బాజ్ కోపంగ. ఈలోపట నూరున్నిసా వచ్చింది.

"ఇగో సూడు అర్బాజ్. నాకొక మన్మడు గావాలె. యే సైతాన్‌కో ఘర్సే నికాల్‌దో. నీకింకో మంచి పిల్లని జూసి పెండ్లి జేసిస్త. నైతో.. మై యే జహర్ పీలూంగే" అన్కుంట తన చేతిల ఉన్న ఇసం సీసా చూపిచ్చి తన కమ్రలకు వోయి తలుపులు బిడాయించుకున్నది.

నఫీజ్ దుఃఖం మరింత ఎక్కువయ్యింది. కండ్లపొంటి నీల్లు ఆగకుంట కారిపోతనే ఉన్నయి. అర్బాజ్ ఏమీ సమజుల వట్టకచ్చింది. ఆమెని ఎట్ల బుదిరికియ్యాల్నో తెల్వకచ్చింది.

పిల్లలు ఈటీవీ ఉర్దూ చానల్ సూస్తున్నరు. టీవీల 'జిందగీ తుమ్‌కో తో బస్ ఖ్వాబ్‌మే దేఖాహమ్‌నే' పాట విషాదంగ ఇనవడ్తున్నది.

అర్బాజ్ పరేషానయ్యిండు. కోరికోరి చేస్కున్నడు నఫీజ్‌ని. అర్బాజ్‌కు నఫీజ్ అంటె సాన ప్రేమ. ఆమె ఆరోగ్యం కోసమే డాక్టరమ్మ చెప్పిందని నస్‌బందీ చేపిచ్చిండు. ఆప్రేషన్ చేపియ్యకపోతే కడుపు వస్తది. కడుపువస్తె అట్ల పరేషాన్ గావాలె. చేపిస్తె ఇట్ల. ఈ ముస్లోల్లకు బుద్ధి ఎందుకుండదు. మగపోరలు లేకపోతే ఏమైతదది? మగపోరడు లేకపోతె తనకుండాలె బాదగని వాల్లకెందుకు? తండ్రి మాటలు యాదికచ్చినయ్ అర్బాజ్‌కు. "యే ధోకాహై. హమ్‌కో క్యోఁ నహీ బోలే. ఈ హరాంజాదీని ఇంట్లకెల్లి ఎల్లగొట్టు" అన్నడు. ఇన్నేండ్లయినంక, తనకు ఇద్దరు పిల్లల్ని గన్నాంక ఎటువోతది? అసలు తను తప్పు జేసిండు. తనే నస్ బందీ జేపిచ్చుకున్నని జెప్పితె అయిపోతుండె. గప్పుడు నఫీజ్‌ని ఏమనకపోదురు. ఇన్ని కతలు గాకపోతుండె.

అటు నఫీజ్ ఎట్లయిపోయింది. బక్కపీన్గ లెక్క తయారయ్యింది. అన్నం తింటలేదు. వాల్ల తిట్లే తింటున్నది. నర్సరీకి వోతున్నది అస్తున్నది. ముడ్సుకోని పంటున్నది. అత్త తనని గొడ్రాలి లెక్కనే సూస్తున్నది. ఇద్దరు ముద్ద బంతుల్లెక్క ఉన్న పిల్లల్ని గని గొడ్రాలయ్యింది. ఆడపిల్లలు పిల్లలు గారా ఏంది? బిడ్డలు నానీ నానీ అన్కుంట ఉరుకుత మీదకొచ్చి పడితె మొన్నటిదాంక కుషయిపోయి ముద్దులు వెడ్తుండె... ఇప్పుడు "చల్ జావ్ బేషరమ్ లడ్కియా" అన్కుంట తరుముతున్నది. అది ముట్టినా గొడ్తున్నది... ఇది ముట్టినా గొడ్తున్నది. నా మీది కుమ్ముతోని పిల్లల్ని సుగ వోరుస్తలేదు. మామ ,సుగ అంతే... నిపుకలు ఎగవోస్తుండు... తనని బేటీ అని పిల్సేటోడు... ఇప్పుడు హరాంజాదీ అనే అంటున్నడు. ఒక్క మగ పోరన్ని కననందుకు ఎంత చీదరించుకుంటున్నరు వీండ్లు. ఇంట్లకెల్లి ఎల్లిపొమ్మంటున్నరు. ఎటుబోత? ఎట్లవోత? ఈ మకాన్ నాదనుకోనే అచ్చినగద... అగ్గో గా కమ్రీ నా కష్టంతోనే గట్టిందిగాదూ!... ఈ ఇంట్ల అయిదు రంజాన్లు అయిదు బక్రీద్‌లు జూసింది తను. అగ్గో అటక మీదగా ఉయ్యాల తొట్లెల తన ఇద్దరు బిడ్డెలను పండుకోబెట్టి జోలపాటలు వాడింది. ఇంటెన్క పెరంట్ల గులాబి చెట్లు, మల్లె చెట్టు, దడికి దొండ తీగెలు, అంకాయలు, బెండకాయలు, పుంటికూర, తోటకూడ మడులు, ఒగ మూల కల్యమాకు చెట్టు, ఇంటి ముంగట బఱ్రె తన పుట్టింటోల్లు ఇచ్చిందే. ఇంటికి తను కోడలేగని ఏం తక్కువ జేసింది. ఆయనతోని సమానంగ ఇంటిని సగవెట్టింది. ఇద్దరి ఆమ్దాని గలిస్తెనె ఇల్లు నడుస్తాంది. ఇంత జేస్తున్నా ఒగ మగ పోరడు పుట్టనందుకు అన్ని ఎన్కకు పోయినయ్. మాట మాట్లాడితే చలేజావ్ అంటున్నరు. మొన్న చాయ చేస్కపోయి ఇస్తె అబ్బా చాయ కోపుని గోడకు ఇసిరికొట్టి "చలే జావ్! బేషరమ్ ఔరత్" అని అర్సిండు తనమీద. అర్బాజ్ చూస్తనే ఉన్నడు ఇదంత... ఏమనడు... మూడు కాన్పుల్ల ఆడపోరీలు పుట్టినంక అత్తోరింటోల సతాయింపులకు ఎట్లెట్ల ఏడ్సిందో ఆడబిడ్డె ఫాతిమా సంగతి వీల్లు అప్పుడే యాదిమర్సిన్రా... అగ్‌లేబార్ బచ్చా నై పైదా హువాతో తలాక్‌దేకే దూస్రీ షాదీ కర్‌దేంగే అని గామె బొల్లున ఏడిస్తె "కైసా కర్తే దూస్రీ షాదీ... మగపోరడు పుట్టుడు మన చేతుల్ల ఉన్నదా. దిమాగ్ గిట్ల కరాబైందానే మీ అత్తోరోల్లకు" అని ఎగిరెగిరి పడింది అత్త. నాల్గో కాన్పుల మగపోరడు పుట్టి ఫాతిమా బత్కిపోయిందిగని ఆడిపోరయితే ఏం జేద్దురు? తన బిడ్డకు కష్టం వస్తె ఒగ తీరు... కోడలి దగ్గరికచ్చేవరకాల్ల ఇంకొక తీరు ఆలోశన జేస్తరు. ఇప్పుడు తనకెవలున్నరు? పెండ్లయిన యాడాదికే బీమారయి అమ్మీ అబ్బాలు ఒగరెనుక ఒగరు సచ్చిపోయిన్రు. ఉన్న ఒక్క దీదీ పెనిమిటి సచ్చిపోయి బీదర్‌ల బత్కనీకి తన్లాడుతున్నది. ఇగెవరికి చెప్పుకోవాలె... ఆయన దప్ప ఈ దునియల ఎవలున్నరు తనకు... నఫీజ్ ఆలోశనలు వొడుస్తలెవ్వు తెగుతలెవ్వు.

> తెల్లారింది మొదలు నఫీజ్‌కు జీనా హరాం అయ్యింది. నూరున్నిసా గునుగుడు ఎక్కువైంది. ఊకూకనే ఏడుస్తది. శాపాలిస్తది, చాయ ఇస్తె వద్దంటది. అన్నానికి పిలిస్తె లెవ్వదు. తానం గీనం చెయ్యక ముడ్సుకపంటది. అప్పుడే ఏడస్తది అప్పుడే ఖామోష్ అయిపోతది. ఎవ్వలతోని మాటలేదు ముచ్చటలేదు. పిస తీసినట్లే అయ్యింది. ఇది జూసి అర్బాజ్‌కు తాయి మాయిగున్నది.



నర్సరీల నఫీజ్ ఖాస్ దోస్త్ బాలమణికి దప్ప ఆమె కష్టం ఎవలకి దెల్వదు. "ఏం పని ఫికర్ జేత్తవే... ఏమయితె అదైతది... ఏమన్న యితె మేం లేమానే" అని భరోసా ఇచ్చి అన్నం తినవెడ్తాంది బాలమణి.

** ** **



"నఫీజ్‌కి మల్లా పిల్లలు పుట్టనీకి ఆప్రేషన్ జేపిత్త ఉస్కేబాద్ బచ్చే హోతే బోల్రే డాక్టరమ్మ" అన్నడు అర్బాజ్ రొట్టెముక్క నోట్లె వెట్టు కోని.

"ఆప్రేషన్ జేపిత్తె ఏమైతది? పైసలు ఖర్చువుడు దప్ప క్యా ఫాయిదా. పిల్లలు పుడ్తరని గ్యారంటి గిట్ల ఉన్నదారా? ముఝే సబ్ మాలూం హై. ఆప్రేషన్ కయ్యే కర్చులతోని ఇంకో పెండ్లి జేసుకుంటె పాయే... యే హరాంజాదీకో తలాక్ దేదే" అన్నది నూరున్నిసా కోపం తోని.

"నై అమ్మీ! కల్ హమ్ షహర్ జారే" అర్బాజ్ ఏం వినదల్చుకోలె. చుప్‌చాప్‌గ తల్లెల రొట్టె తినేసి కమ్రలకు వోయిండు. పెనిమిటికి తనమీదున్న మొహబ్బత్‌కు నఫీజ్‌కు దుఃఖమచ్చింది. తల్లెలన్నీ ఎత్తి అంటిల్లు సర్ది అర్బాజ్ తానకువోయింది.

"ఫిర్ మేరేకో బచ్చే హోంగే క్యా" ఆశ తోని కండ్లపొంటి నీల్లు కారుతుంటె అడుగుతున్న నఫీజ్‌ని "క్యోఁ నహీ... జరూర్ హోంగే. ఆప్రేషన్ అయినంక జల్ది నీ ఒడిల పిలగాడుంటడు" అని గుండెలక దుమ్ముకున్నడు అర్బాజ్

** ** **

"మల్ల పిల్లలు పుడ్తరని గ్యారంటీగా చెప్పలేము. ఫిఫ్టీ ఫిఫ్టీ చాన్సుంటది. అయినంక పిల్లలు గాలేదని మమ్ములనంటె కుదరదు మల్ల. మీకిష్టమైతె చెప్పుర్రి ఆప్రేషన్ జేస్త" అన్నది డాక్టరమ్మ.

"కరో అమ్మా... హుయీతో హుయీ నై తో నహీ. ఘర్‌మే యే గడబడ్ యే కిర్‌కిరీ ఏక్‌దో సాల్‌తో బంద్ హోజాయేంగే" అన్నడు అర్బాజ్.

ఆప్రేషన్ అయ్యింది. అయినంక ఆడిబిడ్డె ఫాతిమా సూడనీకి అచ్చింది. "క్యాకీ భాబీ... మరద్ బచ్చా నహీహైతో జిందగీ బర్‌బాద్ హోజాతీ... మంచిపని జేసినవ్... అబ్ జల్దీసే ఏక్ మరద్ బచ్చాకో పైదాకరో" అన్కుంట నగింది.

"లడ్కీ పైదా హుయీతో?" కోపంగ అడిగింది నఫీజ్. ఆడ్నే అత్త నూరున్నిసా కూసున్నది.

"ఏంగాదు. ఇంకోసారి కోషిష్ జెయ్యి. ఫాతిమాకు పుట్టలె నాల్గో కాన్పుల! హమారే నానీ బారా బచ్చేంకో పైదాకరీ మాలూమ్. ఔరత్‌కా కమీహై బచ్చేంకో పైదా కర్నా" చేతులు తిప్పుకుంట అంటున్నది నూరున్నిసా.

ఇగంతె... రక్తంపోయినా కంటనే పోవాలె. పన్నెండుమందిని కంటె రక్తం యాడుంటది. బచ్చేదానీ చినిగిపోయేడ్దాంక కంటనే ఉండాలి.. నఫీజ్‌కు నీర్సంతోని కండ్లు తిరిగినట్లయ్యింది.

గొన్ని దినాలు ఏమనలె నూరున్నిసా. అంతా ఖామోష్ అయిపోయిర్రి. నఫీజ్ దువాల మీద దువాలు జేస్తున్నది మగ పోరని కోసానికి. ఎవలేం జెప్తె అది దింటున్నది. ఔలాద్ గావాల్నని అర్బాజ్ మసీదుల్ల, దర్గాలకాడ దువాలెక్కువ జేసిండు. నఫీజ్‌ని పహాడీ షరీఫ్ దర్గాకి తీస్కపోయి మొక్కుకుండు.

దినాలు నెలలైనయ్. గునుగుడు షురు అయ్యింది. నఫీజ్ వరేషాని ఇంకెక్కువయ్యింది. దువాలెక్కువ చేసింది.

నెలలు యాడాదైంది... గునుగుడు తిట్లకి మారుతాంది. నఫీజ్ గుండెల్ల దడ ఎక్కువయితాంది. ఉపాసాలు షురు జేసింది.

సంవత్సరం ఎల్లి- ఇంకో సంవత్సరం షురు అయ్యింది. అదిగూడ ఖతం అయ్యింది. నూరున్నిసా అల్టిమేటం ఇచ్చింది. నఫీజ్ గుండె ఆగినంత పనయింది. అత్తకాల్ల మీదవడి ఏడ్సింది. ఇంకొక యాడాది జూద్దామన్నది. ఏడ్పు దుఃఖంతోని మనిషే కన్నీటి ముత్తదయ్యింది.

ఈ నడిమిట్ల రంజాన్లు అచ్చినయ్, బక్రీద్‌లచ్చినయ్ ఎల్లిపోయినయ్. మొహ్రం వచ్చె, చార్మినార్ వోయి బీబీకా ఆలమ్‌కిదట్టి గట్టింది. ఆడిబిడ్డ ఫాతిమా, పక్కింటి ఖతీజాబేగం పక్కూర్లె నూరున్నిసా చెల్లెలి బిడ్డె సాధికాలకు ఔలాద్‌లు బుట్టిన్రు. వాల్లకేగాదు దునియల మస్తుమందికి మరద్‌బచ్చాలు పుట్టిన్రు. అట్ల సానమంది బత్కిపోయిన్రు. ఒక్క నఫీజ్‌కు మాత్రం ఎవలు పుట్టలె.

నూరున్నిసా అల్టిమేటం ఇచ్చింది. నఫీజ్ గుండె ఆగినంత పనయింది. అత్తకాల్ల మీదవడి ఏడ్సింది. ఇంకొక యాడాది జూద్దామన్నది. ఏడ్పు దుఃఖంతోని మనిషే కన్నీటి ముత్తదయ్యింది.

మరి... నూరున్నిసా ఏం జేసింది.

నూరున్నీసా కొడుక్కు రిష్తా తీస్కచ్చింది.

నూరున్నీసా ఇషం సీసా సూపిచ్చింది.

నూరున్నీసా కొడుక్కు నిఖా జేపిచ్చింది.

మరి... నఫీజ్ ఏం జేసింది?

అర్బాజ్ నిఖా అయిన తెల్లవారె పెరంట్ల నూతిల తన ఇద్దరు బిడ్డిలతోని శవమై తేలింది. జిందగీని ఖ్వాబ్‌ల గూడ చూసుదు ఇష్టంలేక.

# లో బిపికి హోమియో వైద్యం

లో బీపిపై వైద్యులు అంతగా శ్రద్ధ చూపించడంలేదు. కారణం హైబిపిలాగా ఇది ప్రమాదకారి కాకపోవడమే. తీవ్రమైన రోగ సంబంధమైన లక్షణాలు బయటకు కనవడనంతవరకు తక్కువ రక్తపోటు కేసులు అధిక రక్తపోటు కేసుల్లాగా ఎక్కువ ఉండవు.

లోబిపి రెండురకాలుగా ఉంటుంది. రక్తపోటుకు ప్రత్యేకమైన కారణాన్ని నిర్ధారణ చేయాలి. బహుశా ఈ స్థితికి వంశ చరిత్ర ఒక కారణంగా కూడా ఊహించవచ్చు. కాని ఇది అంత సులభంగా కనిపించదు. దీనినే మొదటి దశగా పిలుస్తారు. ఇక రెండవ దశలో ఈ రక్తపోటు సర్వసాధారణంగా వస్తుంది. ఈ కేసుల సంఖ్య అధికంగా ఉంటుంది. ఇవి ఏదో ఒక పురాతన వ్యాధి ఫలితమై వుంటుంది. రెండవ దశలో రక్తపోటుకు కారణాలున్నాయి.

సెరిబ్రోస్పైనల్ మెనింజైటిస్ తప్ప మిగిలిన అంటు వ్యాధులన్నీ రక్తపోటు పతనానికి కారణమవుతాయి.

మధుమేహం, క్షయ తదితర దీర్ఘకాలికంగా ఉండే వ్యాధులకు ఏ కారణం చేతనైనా పోషక లోపం ఉంటే వచ్చే అవకాశం ఉంది.

కార్డియో వాస్క్యులర్ వ్యాధులు: గుండె విస్తరించడం గుండె కండరాల వద్ద వాపు మిట్రల్ స్టైనోసిస్, అర్టీరియో స్లిరోసిస్, మృత్యువుకు ముందుగా గుండె విఫలం చెందుతుంది. శరీర రసాలు నష్టపోవడం రక్తస్రావం, విస్తారంగా విరేచనాలు, కలరా తదితర వ్యాధులు వ్యాపిస్తాయి.

నరాల వ్యాధులు: అమిత మూర్ఛ తర్వాత నడుం రంధ్రం పడుతుంది. అలసట ఎనోఫలెక్టిల్ శస్త్రచికిత్స.

లోబిపితో బాధపడే రోగులు తాము చేస్తున్న సాధారణ వృత్తులలో కూడా సామాన్య శక్తితో గడపలేరు. దీనికి విశ్రాంతి ఎక్కువ అవసరం. ముఖ్యంగా పడుకుని నిటారుగా లేచే స్థితిలో రక్తపోటు పడిపోతుంది. దానివల్ల తల తిప్పడం, మైకం రావడం జరుగుతుంది. సెరిబ్రల్ కరోనరి థ్రాంబోసిన్ వచ్చేందుకు లోబిపి కూడా ఒక కారణమే. లోబిపి ఉన్నవారిలో ఎక్కువగా రక్తం గడ్డ కట్టేలా చేస్తుంది. ఇది ఆర్టీరియా స్కిరోసిస్, అధిక రోగులలో కనిపిస్తుంది. కరోనరి, సెరిబ్రల్ థ్రోయిసిస్ కూడా కనిపిస్తుంది. ఈవిధంగా వుండే లోబిపి లక్షణాలను బట్టి హోమియో మందులు వాడి లోబిపిని తగ్గించుకోవచ్చు.

**కాల్కిఫాస్ 200:** శుష్కింపచేసే దీర్ఘకాలిక వ్యాధుల ఫలితం, కూర్చొన్నా, నిలబడినప్పుడు శారీరకంగా బలహీనత కలిగినప్పుడు ఈ మందు వాడాలి

**కార్బోఆన్ 200:** బలహీనపరిచే రోగాల తర్వాత, నిరుత్సాహం ఉండడం, కూర్చొని ఉన్నప్పుడు తలతిప్పటం, గందరగోళంగా ఉండడం జరుగుతుంది.

**కార్బోవెజ్ 200:** రోగికి కొవ్వు పట్టడం, బద్ధకం, రోగ లక్షణాలన్నీ దీర్ఘకాలంగా ఉండడం.

**కాస్టికం 200:** పక్షవాతం కలిగించే తీవ్రమైన మానసిక అదురు ఉండడం వల్ల మెదడు నిర్వహణలో లోపాలు కలిగే అవకాశం దీనిద్వారా సర్దుకుంటుంది. దీర్ఘకాలపు దుఃఖం విచారం, నిద్రలేమి తదితర విషయాల్లో సంతృప్తిని కలిగిస్తుంది. అందువల్ల ఈ మందుల ఉపయోగం చాలాఉంటుంది. కనుక వీటిని వాడడంలో వైద్యులు ఎక్కువగా ప్రాధాన్యతను కనబరుస్తుంటారు.

- డా॥ దండెపు బస్వానందం